ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# చరిత్రలో ఒక ప్రేమ ఆనవాలు "నాగలాదేవి" నవల (శ్రీకృష్ణదేవరాయల ప్రేమకథ)

**ఆచార్య ఎం.గోనానాయక్**

తెలుగు శాఖ,హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ,హైదరాబాద్.

Article Received: 18/12/2024 Article Accepted: 15/01/2025 Published Online: 21/01/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2103

**ఉపోద్ఘాతం:** చారిత్రక నేపథ్యంలో పరిశీలించినప్పుడు ఒక చరిత్రను ప్రక్రియలో ఇమిడ్చి తెలియ జేసినప్పుడు ఏ రచయిత అయినా వాస్తవికత నేపథ్యంలో భాషను భావనతో కలిపి ప్రక్రియను పండిస్తాడు. ప్రధానంగా నవలా ప్రక్రియ అయితే వివరణాత్మకంగా విశదం చేసే వెసులుబాటు ఉంటుంది.గతాన్ని, అందులో జరిగిన పరిణామాలను వివరణాత్మకం చేసేటప్పుడు పరిశోధన ఎంతో అవసరం. ఇది ఒక కోణమైతే మరొక కోణంలో నేటివిటీకి దగ్గరగా నవలను తీర్చిదిద్దడంలో ఎన్నో విషయాలనాశ్రయిస్తాడు. ఎందరినో సంప్రదిస్తాడు. అప్పటికీ నవల, అందునా చారిత్రక నవలను తీర్చిదిద్దడంలో అతని శ్రమ నూటికి నలభై అయిదు శాతం విషయ సేకరణ ఆధారాలపై ఆధారపడితే, మిగిలిన యాభై అయిదు శాతం స్వకపోల సృజనపై ఆధారపడి ఉంటుంది. ఇవి భారతీయ సమాజంలో స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతర ఇతర భాషల్లోలాగనే తెలుగులోను చోటు చేసుకున్నాయి. ప్రధానంగా తొలితరం, మలితరం అని వింగడించి పరిశీలిస్తే - నాటి కవి సమ్రాట్ నోరి నరసింహశాస్త్రి గారి నుండి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారి దాకా అందరూ పై విధానాలనే అనుసరించారు. ఇది ఒక పార్శ్వం అయితే ఈ విధానాలకు, ఆ చారిత్రక నవలా రచయితలకు భిన్నంగా 2022 సం||లో శ్రీ భగీరథ గారు ఆవిష్కరించిన 'నాగలాదేవి' శ్రీకృష్ణదేవరాయల ప్రేమకథ పేరుతో ఉన్న చారిత్రక నవల విషయపరంగానూ, విశదీకరణ పరంగానూ ఉన్నత, ఉత్తమ ప్రమాణాలతో ఉందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

**కీలక పదాంశాలు:** నాగల దేవి నవల, భగీరథ సాహిత్యం, జానపద కథల, చారిత్రక అంశాల విశిష్టత.

**రచయిత పరిచయం:** రచయిత విషయానికొస్తే భగీరథ గారు వృత్తిరీత్యా జర్నలిస్టు. ప్రవృత్తిపరంగా ఈ 'నాగలాదేవి' నవలను అపూర్వంగా తీర్చిదిద్దారు. ఈ నవల ద్వారా వారు చారిత్రక నవలా రచయితల జాబితాలో చేరిపోయారు. ఇది పొగడ్త కాదు. మనసులో నుండి ఒక అనుభూతితో వచ్చిన మాటలన్నది నిర్ద్వంద్వంగా ఒప్పుకోవాల్సిన విషయం.

**శిల్ప నేపథ్యం:** ఈ నవలను శిల్ప నేపథ్యంలో పరిశీలిస్తే ప్రధానంగా తెలుగు విమర్శలో 'శిల్పం' అన్నదానికి ఒక ప్రత్యేకమైన అర్థంలో వ్యాప్తం చేసినవారు విశ్వనాథవారే. ఈ విషయాన్ని విశ్వవ్యాప్తం చేసినవారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారే. అయితే శిల్పాన్ని కట్టమంచివారు 'కళ' అనే నేపథ్యంలో వాడారు. తిక్కన 'భారతం' గమనిస్తే ఈ శిల్పం గద్య పద్య సమ్మిశ్రణమే అని కూడా కట్టమంచి వారు తెలియజేసారు. ఇక భగీరథ గారి నవల పరంగా శిల్పాన్ని వివేచింపవలసివస్తే ఈ నవల్లో శిల్పం భగీరథ గారి ప్రతిభకు నూటికి నూరుపాళ్ళు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ప్రయోజనాన్ని కలిగించింది. వివరాల్లోకి వెళ్ళి ఈ నవలలోని శిల్పాన్ని స్పర్శిస్తే శిల్ప విషయపరంగా ఎన్నో విషయాలు వెలుగు చూస్తాయి.

నవలను భగీరథ గారు ఎందుకోసం వ్రాస్తున్నది స్పష్టంగా తెల్చుకున్నారనడానికి రూఢీ పాఠకులకు అవగతం కావడమే. ఈ నవల ఆది నుంచి చివరి దాకా కవితాత్మకంగా జరిగిందనవచ్చు. అలాగే ఈ నవల్లో రచయిత ప్రతి సంఘటనకు వెనక నేపథ్య వాతావరణాన్ని కంటికి కట్టినట్లు చేసారు.

**పాత్ర చిత్రణ:** ఈ నవల్లో పాత్రల రూపకల్పనతో పాటు స్వభావాలను కూడా స్పష్టంగా పాఠకులకు అనుభూతిలోకి వచ్చేటట్లుగా చిత్రించారు. వర్ణనలను నవల పరమార్థానికి దోహదపడేటట్లుగా చిత్రణ చేసారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ-

"రంగమండపం దగ్గరకు వెళ్లి ఓ మూల నుంచున్నాడు. దేవాలయంలో గంటలు మ్రోగాయి. పూజారులు మంత్రాలు చదువుతున్నారు. అర్చన తర్వాత ఆమెను ఆశీర్వదించారు. ఆమె గర్భగుడిలో నుంచి రంగ మండపంలోకి వచ్చింది. అప్పుడే నట్టువాంగం మొదలైంది." (నాగలాదేవి, భగీరథ, పుట 27)

అలాగే అధ్యాయాల విభజన యుక్తంగా చేసి, ముగింపుకి అవి సమన్వయం చేశారు. నవల్లో ఆయా సందర్భాలలోని విషయాలు ఔచిత్యాన్ని ప్రదర్శించారు. కృష్ణరాయలు, నాగలాదేవి పాత్రలు పవిత్రతకు ఆనవాళ్ళుగా నిల్చాయి. నాగలాదేవి వేశ్య కుటుంబంలో పుట్టినా గుణ గణాల విషయంలో ఉదాత్తంగా తీర్చిదిద్దారు రచయిత.

ఈ నవల్లో నాగలాదేవి పాత్ర ఈ నవలకు కేంద్రకం, కీలకంగా కూడా రచయిత తెలియజేసారు. ఉదాత్తతకు, త్యాగానికి, నిష్కల్మషతకు ప్రతీకగా కన్పిస్తుంది. తామరపువ్వు బురదలో పుట్టినా మలినమంటనట్లు నాగలాదేవి వేశ్య కులంలో పుట్టినా నాట్యాన్ని నమ్ముకుందే తప్ప పర పురుషుడిని కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకలేదు. తన మనసులో స్థానం శ్రీకృష్ణదేవరాయలకు ఇచ్చింది. అందుకే కృష్ణరాయలను మనసా, వాచా, కర్మణా త్రిగుణాత్మకంగా నమ్ముకుంది. కృష్ణరాయలెవరో తెలియనప్పుడు ఒక వీరునిగా తనని అభిమానించే సామాన్యునిగా భావించుకుంది. కృష్ణరాయలెవరో తెలిసాక తనకంటూ హద్దు లేర్పరచుకుంది. కృష్ణరాయలు ఆమె హద్దులను చెరిపేసి తన జీవితంలో దేవేరిగా నిలబెట్టాడు.

నాగలాదేవిని మానవతావాదిగా రచయిత అనేక కోణాల్లో తెలియజేసారు. ప్రజలే ఆమెకు ప్రాణమన్న విషయాన్ని రచనా శిల్పంలో భాగంగా తెలియజేసారు.

**"ప్రజలు బాగా ఇబ్బంది పడుతున్నట్టు చిన్నాదేవి గ్రహించింది.**
**ఎక్కడా పొయ్యి వెలిగించినట్టు కూడా కనిపించలేదు.**
**మంత్రులు, దళపతులు పరిస్థితిని అంచనా వేస్తున్నారు.**
**చిన్నాదేవి వచ్చిందని తెలుసుకున్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు.**
**చిన్నాదేవికి అందరూ అభివాదం చేశారు.**
**ప్రజల దగ్గరగా గుర్రాన్ని పోనిచ్చి క్రిందకు దిగింది.**
**వతలప్ప, నాయకుడు, తిరుమల దేవ రాయలు ఇద్దరూ అప్రమత్తంగా ఉన్నారు.**
**నాయుధులైన సైనికులు కూడా చిన్నాదేవికి రక్షణగా ఉన్నారు.**
**"చిన్నమ్మగారూ మా కోసం వచ్చారా? అన్నం లేకపోయినా ఫర్వాలేదమ్మా.**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**ఈ ఆనందంతో కడుపు నిండిపోయింది" అన్నది ఓ మహిళ.**
**"మీ మానవతా హృదయం చాలా గొప్పదమ్మా" మరో వృద్ధుడు.**
**"రాయలవారు రాజధానిలో లేరు మా కష్టాలు తీర్చేవారు లేరనుకున్నాము. మా తల్లిలా వచ్చావమ్మా" మరొక బాలుడు.**
**ప్రజల మాటలకు చిన్నాదేవి చలించిపోయింది.**
**వర్షం కారణంగా వారంతా భోజనం చెయ్యలేదని అర్థమైంది.**
**ప్రజలనందరినీ సమీపంలోని దేవాలయానికి తరలించమని వితలప్పతో చెప్పింది." (నాగలాదేవి, భగీరథ, పుటలు 158, 160)**

పై సన్నివేశంలో నాగలాదేవిని హిమాలయం అంత సమున్నతంగా గుణప్రాతిపదికతో రచయిత వివరణాత్మకం చేసాడు.

**నవల త్రికోణాలు:** ఈ నవల ద్వారా రచయితను మూడు వినూత్న కోణాలలో దర్శిస్తాం. మొదటిది రచయిత కోణం. రెండవది పరిశోధక కోణం. మూడవది జ్ఞాన కోణం. ఈ మూడు కోణాల్లో భగీరథ గారు తామేమిటో నిరూపించుకున్నారనిపిస్తుంది. ఒక కోణంలో వారు ఏది తేలికగా తీసుకోనివారుగా దర్శనమిస్తారు.

భగీరథ గారు రాసిన రచనలన్నీ ఒక ఎత్తు అయితే 'నాగలాదేవి' చారిత్రక నవల మరొక ఎత్తు. తులసీదళంతో కృష్ణుడంతటివాడ్ని తూచి తానేమిటో లోకానికి చాటింది రుక్మిణి. అలాగే నాగలాదేవి తన ప్రేమతో, మానవతా హృదయంతో కృష్ణరాయని మనసు గెలుచుకుంది. ఇది యాదృచ్ఛికం కాదు. రచయితలోని తపన, తాత్త్వికత, మరుగునపడిన పాత్రను వెలికితెచ్చే ప్రయత్నం వెరసి ఈ నాగలాదేవి నవలైంది.

నాగలాదేవి నవల చదుమతన్నప్పుడు రుద్రమ్మ, మాంచాల వంటి ఉదాత్త స్త్రీ పాత్రలు పాఠకుని కన్నెదుట నిలుస్తాయి. అంతకంటే హుందాతనంతో, తానెక్కడ పుట్టినా, ఎంత సార్వభౌముని చేపట్టినా నిగర్విగా, దేశాభిమానం ఉన్న స్త్రీమూర్తిగా రచయిత నాగలాదేవిని ఉత్తమ స్త్రీజాతి రత్నంగా తెలిపారు. ఈ సందర్భంలో డా|| సి.నారాయణరెడ్డిగారి పాట భావం నాగలాదేవికి చక్కగా అమరుతుంది. ఆ భావం "మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ. త్యాగంలో అనురాగంలో తరగని పెన్నిధి మగువ". ఈ పదాలు నాగలాదేవి పాత్ర ఔన్నత్యాన్ని చాటిచెప్తాయి. ఈ నవల్లో నాగలాదేవి పాత్ర కేంద్రకం. నాగలాదేవి జీవితాన్ని పొందికగా తీర్చిదిద్దారు భగీరథ గారు.

రచయిత భగీరథ సునిష్టార్థంగా లేని శిల్ప సిద్ధాంతానికి కొత్త అర్థాలను తొడిగిన విశ్వనాథ మార్గాన్ని అనుసరించారు. నవలలో ఆయా సందర్భాలలో చేసిన చర్చలు కథకు అడ్డంకి కాకుండా రచయిత జాగ్రత్తలు తీసుకున్నారు. విశేషమేమిటంటే ఈ నవల్లో ప్రధాన పాత్రతో పాటు ఇతర పాత్రలు కూడా పోటీ పడతాయి.

**నవలా లక్షణాలు:** భగీరథ గారు ఈ నవల్లో నాలుగు విషయాలను ప్రాధాన్యమిచ్చారు. అవి - (1) రచయిత రచనలో ఇమిడ్చిన పరమార్థం (2) ప్రకృతి వర్ణనల సార్థకత (3) ప్రతీకాత్మక పాత్రలు వాటి ఉ నికికి సహజత్వానికి దగ్గరగా నిలవడం (4) ఔచిత్యాన్ని, సందర్భాన్ని శుద్ధి చేసే దిశలో ప్రయోగించి చూపడం. దీనివల్ల 'నాగలాదేవి' నవల వాస్తవికతకు దగ్గరగా సంచరిస్తూనే చదివించే గుణాన్ని కలిగి ఉంది.

**నవలా విశిష్టత:** నాగలాదేవి, కృష్ణరాయల దాంపత్యం మాటలకందనిది. వివాహానికి పూర్వం వారి మధ్య ప్రేమ ఎలా ఉందో, వివాహానంతరం అదే కొనసాగడం విశేషం. మరో విశేషం ఏమిటంటే ఈ నవల్లో మనుజ ధర్మం అనేది సంఘటనల్లో ఆయా సంఘటనలకు అనుకూలంగా రచయిత శక్తివంతంగా తెలియజేసారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

రచయిత వృత్తిరీత్యా పత్రికకు సంబంధించిన వ్యక్తి. పాత్రనెంత వైవిధ్యంగా అందించారో ఈ నవల్లో చారిత్రకాంశాలను అంత నిబద్ధతతో తీర్చిదిద్దారు. ప్రధానంగా మిగిలిన చారిత్రక నవలల్లో నవలాకర్తలు ఇదమిద్ధంగా నవలా సందర్భానికి అనువైన సమాచారాలనందించే

విషయంలో కొంతమేరకే న్యాయం చేసారు. కానీ భగీరథగారు ఈ నవల్లో అంశాలకు నిర్ధారణగా తెలియజేసే కాల సంకేతాలను రోజు, నెల, సంవత్సరం వంటి విషయాలను వివరణాత్మకం చేసారు. నేలటూరు వారు విజయనగర శాసనాలను వెలికి తీస్తే భగీరథ గారు ఆ శాసనాలంతర్గత తేదీ, సంవత్సరం సమాచారాన్ని సాధికారికంగా అందించారు.

నిజానికి ఈనాడు వ్యాప్తంలో ఉన్న కృష్ణరాయలవారి జీవితానికి సంబంధించిన అనేక వక్రీకరణల వెనుక వాస్తవాలను భగీరథ గారు వెలికితీసే ప్రయత్నం చేసారు. అలాగే మధ్య యుగాల నాడు జరిగిన ఒక ప్రేమకథ ఈ 'నాగలాదేవి' నవల అన్న భగీరథ మాటలు, వారిలోని పరిశోధకుడిని దర్శింప చేస్తాయి.

సంభాషణల్లో అదును, పదును ప్రదర్శించి ఈ నవలలో కథనానికి కొత్తదనం తీసుకు వచ్చారు. అంతేకాకుండా నవల్లో పురంధరదాసు, అన్నమయ్యల పదకవిత్వాన్ని సందర్భం పండించేందుకు వాడుకున్నారు. హృదయం ద్రవించే విధంగా వీరుడు, ప్రేమమూర్తి అయిన కృష్ణరాయలు నాగలాదేవి అంతిమ దశలోని ఆమె అంతరంగాన్ని ఇలా ఆవిష్కరించాడు-

"మహారాజుగా, మహా మనీషిగా, సమర్థుడైన పాలకుడుగా, ఆరాధకుడుగా, నీ కీర్తి అసరామరంగా ఉంటుంది. నీలాంటి చక్రవర్తి, రాజనీతిజ్ఞుడు, ఈ భూమ్మీద మరొకరు ఉండరు. కాలాలు మారినా, తరాలు గడిచినా, జాతి నిన్ను ఎప్పుడూ మర్చిపోదు. భాషను శ్వాసించి, మతాన్ని శాసించి, సంస్కృతిని పరిరక్షించావు. జాతికి అభయహస్తం అందించావు." (నాగలాదేవి, భగీరథ, పుట 268)

పై మాటల వలన నాగలాదేవి ఆంతర్యం కడవరకు నిష్కామ కర్మకు, జాతి పట్ల ఆమెకు గల గౌరవం, తనలాగే ప్రభువు నిలబడడం ఆమె జీవితానికి పరిపూర్ణతనిచ్చే విధంగా భగీరథ గారు ఆ పాత్రను తీర్చిదిద్దారు. నాగలాదేవి భగీరథగారి శ్రమ నుంచి పురుడు పోసుకున్న పాత్ర. అందుకే ప్రతి ఘట్టంలోనూ తన ఔదార్యాన్ని ప్రకటించుకుంది.

**ముగింపు:** ఈ నవల్లో వర్ణనలు చదువుతుంటే ఒక బాపిరాజు గారు దర్శనమిస్తారు. అలాగే ధర్మ చర్చల నేపథ్యంలో నోరి నరసింహశాస్త్రిగారు దర్శనమిస్తారు. కథనంలో ముదిగొండ శివప్రసాద్ గారు దర్శనమిస్తారు.

చరిత్రను చక్కని పాలు తేనెల సమ్మిశ్రణంలో భావం జాలువారేలా తన కలం బలంతో శ్రమించి భగీరథ గారు తెలుగు పాఠిండ్లలో నిల్పిన పదహారణాల తెలుగు అమ్మాయి 'నాగలాదేవి'. ఇంతటి చక్కని నవలను శ్రమ మూలధనంతో ఫలంగా అందించిన భగీరథ గారు నాడు శ్రమతో పట్టుదలతో గంగను భూమిపైకి దింపిన భగీరథునితో నాటి, సరినాటి. ఇదే వారి నవలకు అందించే పవిత్ర నీరాజనం.

**ఆధార గ్రంథాలు:**

భగీరథ, 2002. **నాగలాదేవి నవల,** రచయిత స్వప్రచురణ.

'భగీరథి యొక్క నాగ దేవత మానసా దేవి కథ' వ్యాసం, ది ధర్మ డిస్పాచ్, ప్రచురించబడినది: 17 జనవరి 2023.

వెంకటేశ్వర్లు, పుల్లాబొట్ల. 1974. **తెలుగు నవలా సాహిత్య వికాసం.** విజయవాడ, వై.ఎస్.ప్రెస్.

సంజీవమ్మ, పి. 1985**. తెలుగు నవలలో సామాజిక చైతన్యం**. విజయవాడ, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్.

కుటుంబరాయ శర్మ,బొడ్డపాటి. 1971. **ఆంధ్ర నవలా పరిణామము**. హైదరాబాద్, గాయత్రి ప్రచురణలు.